బ్యాడిగి..బ్యాడ్ లక్!



కూడేరు మండలం ముద్దలాపురం వద్ద తెగుళ్లతో దెబ్బతిన్న బ్యాడిగి మిర్చి

ఏటా వర్షాధారంగా వేరుశనగ సాగు చేసి నష్టాలబాట పడుతున్న రైతులు.. ప్రత్యామ్నాయ పంటలు సాగు మంచి ఆదాయం పొందొచ్చని ఆశించారు. రూ.లక్షలు పెట్టుబడి పెట్టి బ్యాడిగి రకం మిర్చి పంట సాగు చేస్తే ఆర్థికంగా గట్టెక్కొచ్చని అనుకున్నారు. వాతావరణంలో మార్పులు, తుఫాను ప్రభావంతో పంటకు తెగళ్లు సోకి దిగిబడిపై విపరీతంగా ప్రభావం చూపాయి. దిగుబడి అంతంత మాత్రంగానే వచ్చింది. దీనికి తోడు మార్కెట్లో గిటుబాటు ధర లేక బ్యాడిగి రైతులు నష్టాన్ని మూట కట్టుకుంటున్నారు.

నియోజకవర్గంలో బ్యాడిగి మిర్చి సాగు విస్తీర్ణం ఇలా...

మండలం పేరు	బ్యాడిగి మిర్చి సాగు (ఎకరాల్లో..)
కూడేరు	1800
విడపనకల్లు	2,200
బెలుగుప్ప	1,900
వజ్రకరూర్	1,600
ఉరవకొండ	200

- నియోజకవర్గంలో 7,800 ఎకరాల్లో సాగు
- మిర్చి దిగుబడిపై తెగుళ్ల ప్రభావం
- ధర తగ్గుముఖం పట్టడంతో రైతుల ఆందోళన
- పెట్టుబడి కూడా దక్కదంటున్న వైనం

కూడేరు: ఉరవకొండ నియోజకవర్గంలో కూడేరు, బెలుగుప్ప, విడపనకల్లు, ఉరవకొండ, వజ్రకరూరు మండలాలు ఉన్నాయి. ఈ మండలాల్లో బోరుబావుల కింద సుమారు 7,800 ఎకరాల విస్తీర్ణంలో రైతులు బ్యాడిగి మిర్చి పంట సాగు చేశారు. కూడేరు మండలం ముద్దలాపురంలో సుమారుగా 1,200 ఎకరాలకు పైగా పంట సాగు చేశారు. కలగళ్ల, చోళసముద్రం, కరుట్లపల్లి, ఇప్పేరు, మరుట్ల గ్రామాలతో పాటు మరికొన్ని గ్రామాల్లోనూ సాగు చేశారు. వజ్రకరూరు మండలంలో పొట్టిపాడు, చాయాపురం, కొనకొండ్ల, రాగులపాడు, పీసీ ప్యాపిలి, వజ్రకరూరు, బెలుగుప్ప మండలంలో శీర్పి, వెంకటాద్రి పల్లి, జీడిపల్లి, అంకంపల్లి, గంగవరం, విడపనకల్లు మండలంలో వేల్పుమడుగు, హావళిగి, పాల్తూరు, గడేకల్, హంచనహల్లు గ్రామాల్లో బ్యాడిగి మిర్చి పంట అధిక విస్తీర్ణంలో సాగు చేశారు.

దెబ్బతీసిన నల్లి, కాయ మచ్చ పురుగు..

బ్యాడిగి మిర్చి పంట సాగు చేసిన తర్వాత పలు దఫాలు తుఫాను పట్టుకుంది. దీంతో పంటకు నల్లి పురుగు ఆశించింది. ఆశించిన స్థాయిలో పూత రాకుండా రాలి పోయింది. తర్వాత కాయ మచ్చ పరుగు ఆశించింది.దీంతో కాయ రంధ్రాలు పడి దెబ్బతిని, దిగుబడి కూడా ఆశించిన స్థాయిలో రాలేదు. తెగుళ్ల ఆశించకుండా ఉండి పంట బాగుంటే ఎకరాకు 20 నుంచి 30 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. కానీ ప్రస్తుతం 5 నుంచి 10 క్వింటాళ్ల లోపు దిగుబడి వస్తోంది.

నష్టాన్ని మూటకట్టుకుంటున్న రైతులు..

దిగుబడి తగ్గినా మార్కెట్లో ధర ఆశించిన స్థాయిలో ఉంటే రైతుకు లాభసాటిగా ఉంటుంది. ధర కూడా తగ్గిపోయింది. గతంలో నాణ్యత బట్టి క్వింటా రూ.10 వేల నుంచి రూ.14 వేల లోపు ఉండేది. తెగుళ్లతో దెబ్బతిన్న బ్యాడిగి మిర్చి క్వింటా రూ.2 వేల నుంచి రూ.3 వేల లోపు ఉంది. గతంలో కాయ నాణ్యత బట్టి రూ.20 నుంచి రూ. 25 వేలు వరకు పలికింది. రైతులు బ్యాడిగి మిర్చి సాగుకు ఎకరాకు రూ.2 లక్షల వరకు పెట్టుబడి పెడుతున్నారు. దిగుబడి, గిట్టుబాటు ధర లేక పెట్టుబడి కూడా వెనక్కి రావడం లేదు. దీంతో పెట్టుబడులకు తెచ్చిన అప్పులు ఎలా తీర్చాలో దిక్కుతోచక రైతులు మదనపడుతున్నారు. ప్రభుత్వం స్పందించి గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



కలగళ్లలో అమ్మకానికి సిద్ధంగా ఉంచిన మిర్చి

పెట్టుబడి కూడా దక్కలేదు..



ఆరెకరాలకు రూ.10 లక్షలు వరకు పెట్టుబడి పెట్టి బ్యాడిగి మిర్చి పంట సాగు చేశా. 30 క్వింటాళ్లు రూ.11 వేలతో విక్రయించగా, దెబ్బ తిన్న 60 క్వింటాళ్ల మిర్చి.. క్వింటా రూ.3 వేల చొప్పున రూ.1.8 లక్షలకు అమ్మేశా. పంట పెట్టుబడి కూడా వెనక్కి రాలేదు. పెట్టుబడికి అప్పు చేశా. అప్పు ఎలా తీర్చాలో దిక్కుతోచడం లేదు. – సూర్యనారాయణ రైతు, ముద్దలాపురం, కూడేరు మండలం

పంట పూర్తిగా దెబ్బతింది



రూ. 9 లక్షలు పెట్టుబడి పెట్టి ఏడెకరాల విస్తీర్ణంలో బ్యాడిగి మిర్చి పంట సాగు చేశా. ఏపుగా పెరగడంతో ఎన్నో ఆశలు పెట్టుకున్నా. కానీ కాయమచ్చ పురుగు, నల్లితో పంట దెబ్బతినింది. మార్కెట్లో ధర లేదు. మిర్చి తొలగించేందుకు కూలీలు ఖర్చు అధికంగా అవుతోంది. – కదిరిప్ప రైతు, ముద్దలాపురం, కూడేరు మండలం

తెగుళ్లతో దెబ్బ



అప్పు చేసి 15 ఎకరాల విస్తీర్ణంలో బ్యాడిగి మిర్చి సాగు చేశా. రూ.18 లక్షల వరకు పెట్టుబడి అయ్యింది. తుఫాను ఓ వైపు, నల్లి, కాయమచ్చ పురుగు మరో వైపు పంట దిగుబడిపై ప్రభావం చూపింది. దీంతో దిగుబడి బాగా దెబ్బతినింది. పంట కొనుగోలు చేసేందుకు వ్యాపారులు ముందుకు రావడంలేదు. క్వింటా కేవలం రూ.3 వేలతో 70 క్వింటాళ్లు అమ్మినా. రూ.లక్షల్లో నష్టం వచ్చింది. – ధనుంజయ, రైతు, కూడేరు మండలం

క్లుప్తంగా

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు



కూడేరు: బాలిక తల్లిదండ్రులతో మాట్లాడుతున్న సీడీపీఓ, పోలీసులు

కూడేరు: మండలంలోని కడదరకుంటలో ఈ నెల 9న చేయనున్న బాల్య వివాహాన్ని అధికారులు అడ్డుకున్నారు. బాలిక బంధువుల అబ్బాయితో వివాహం చేస్తున్నారని 1098 చైల్డ్ హెల్ప్‌లైన్‌కు, ఐసీడీఎస్ అధికారులకు సమాచారం అందింది. దీంతో శనివారం ఉరవకొండ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ శ్రీదేవి, ఏఎస్ఐ రామానాయుడు బాల్య వివాహం చేయనున్న వారి ఇంటికి వెళ్లి బాలిక తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. బాల్య వివాహం చేయడం ద్వారా అమ్మాయికి ఆరోగ్య సమస్యలు వస్తాయని, చట్టరీత్యా నేరమని తెలియజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లలితమ్మ, ఐసీడీఎస్ సూపర్ వైజర్ అరుణ, వీఆర్వో ఎర్రెమ్మ, అంగన్‌వాడీ, మహిళా పోలీసు వెంకటరమణమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశాలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

కూడేరు: మండలంలోని అరవకూరు వద్ద శనివారం అనంతపురం- బళ్లారి ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆమిదాలకు చెందిన ఎర్రిస్వామి తీవ్రంగా గాయపడగా, పద్మావతి, సరస్వతి, గోపాల్ స్వల్పంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు.. పద్మావతి అనే మహిళను ఆటోలో అనంతపురం ఆస్పత్రికి తీసుకెళ్తున్నారు. అవరకూరు వద్దకు రాగానే రోడ్డుపక్కన ఆటోను నిలిపారు.వెనుకవైపున కర్ణాటక ఆర్టీసీ బస్సు వేగంగా వచ్చి ఆటోను ఢీకొనింది. గాయపడిన వారిని 108 వాహనంలో అనంతపురంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రేపటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్



ప్రభుత్వ జూనియర్ కళాశాల సెంటర్‌లో పరీక్షలకు సిద్ధమైన ల్యాబొరేటరీ

రాయదుర్గంటౌన్: ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్ పరీక్షలు మొదటి విడత 10 నుంచి ప్రారంభం కానున్నాయి. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒకేషనల్, జనరల్ ఇంటర్ విద్యార్థులకు జరిగే ప్రాక్టికల్స్‌కు ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ల్యాబ్‌లో ప్రిన్సిపాల్ విజయలక్ష్మీ పరీక్షలకు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేశారు. ద్వితీయ సంవత్సరానికి చెందిన 120 మంది జనరల్ విద్యార్థులు, మొదటి, ద్వితీయ సంవత్సరానికి చెందిన 560 ఒకేషనల్ విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. కాగా రెండో విడతలో పట్టణంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో ఈ నెల 15 నుంచి ప్రాక్టికల్ పరీక్షలు జరగనున్నాయి.

కళ్యాణదుర్గంలో బుల్లితెర నటుల సందడి



పట్టాభిరామస్వామి ఆలయ ఆవరణలో బుల్లితెర నటులు

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలో బుల్లితెర నటులు శనివారం సందడి చేశారు. ఈనెల 7 నుంచి 14వతేదీ వరకు పట్టాభిరామస్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈసందర్భంగా పాత మార్కెట్ ఆవరణలో పట్టాభి రామస్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడు దేవినేని అవినాష్, కమిటీ సభ్యులు హాస్య సన్నివేశాలకోసం వేదిక ఏర్పాటు చేశారు. బుల్లితెర నటులు అప్పారావు, గడ్డం నవీన్, తదితరులు హాస్య సన్నివేశాలతో ప్రజలను అలరించారు.ముందుగా బుల్లితెర నటులు పట్టాభిరామస్వామి ఆలయం, అక్కమాంబ ఆలయంలో పూజలు నిర్వహించారు.

పదో తరగతి విద్యార్థి అదృశ్యం



విద్యార్థి చంద్రశేఖర్ (ఫైల్)

ఉరవకొండ: మండలంలోని ఆమిద్యాల గ్రామానికి చెందిన చంద్రశేఖర్ ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. ఆమిద్యాలకు చెందిన ఎర్రిస్వామికి ముగ్గురు కుమారులున్నారు. మూడో కొడుకు ఆమిద్యాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. మూడు రోజుల క్రితం చంద్రశేఖర్‌ను తల్లిదండ్రులు మందలించడంతో మనస్థాపానికి గురై ఇంటి నుంచి వెళ్లిపోయాడు. బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద వెతికినా కనిపించలేదు. కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ మహనంది తెలిపారు.

ఉరవకొండలో 'కాఫీ విత్ పార్టీ క్యాడర్'

ఉరవకొండ: నియోజకవర్గంలో పార్టీ నాయకులు, కార్యకర్తల్లో మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి తనయుడు, పార్టీ రాయలసీమ యువజన విభాగం జోనల్ చైర్మన్ ప్రణయ్‌రెడ్డి జోష్ నింపుతున్నారు. శనివారం ఆయన పట్టణంలో కాఫీ విత్ పార్టీ క్యాడర్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన.. అనంతరం అనంతపురం బైపాస్ వద్ద ఉన్న టీస్టాల్‌లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఉత్సాహంగా కాఫీ తాగుతూ మరింత ఉత్సాహాన్ని నింపారు.



బైపాస్ వద్ద టీస్టాల్‌లో నాయకులతో మాట్లాడుతున్న యువనేత ప్రణయ్‌రెడ్డి

పంటల సాగుకు సలహాలివ్వకపోతే ఎలా?

కూడేరు: రైతులకు పంటల సాగులో మెలకువలు, పంటకు సోకే తెగుళ్ల నివారణకు సలహాలు, సూచనలు ఇవ్వకపోతే ఎలా? అని సర్పంచ్ హనుమంత రెడ్డి ఏఓ విజయ కుమార్‌ను ప్రశ్నించారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ నారాయణరెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పలు సమస్యలపై అధికారులను ప్రజా ప్రతినిధులు ప్రశ్నించారు. కమ్మూరులో ఓ కాలనీలో రూ.12 లక్షలతో డ్రైనేజీ నిర్మించేందుకు భూమి పూజ చేసి నెలలు గడుస్తున్నా పనులు ప్రారంభించలేదని సర్పంచ్ రంగారెడ్డి ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ నాగదివ్యను ప్రశ్నించారు. మందులు అందుబాటులో లేక పశుపెంపకందారులు ఇబ్బందులు పడుతున్నారని సర్పంచ్ ఓబులేసు పశు వైద్యాధికారిణి శ్వేతాని అడిగారు. వేసవి సమీపించకనే గ్రామాల్లో నీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఎంపీపీ నారాయణ రెడ్డి ఆర్‌డబ్ల్యూఎస్ జేఈకి సూచించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ అశ్విని, వైస్ ఎంపీపీలు దేవా, సుబ్బమ్మ, కోఆప్షన్ సభ్యుడు సర్దార్, ఎంపీడీఓ కుళ్లాయిస్వామి, హౌసింగ్ డీఈ హనుమప్ప, సీడీపీఓ శ్రీదేవి, పీహెచ్‌సీ డాక్టర్ లక్ష్మీనారాయణ, ఎంఈఓ మహమ్మద్ గౌస్, ఈఓఆర్డీ రాధాకృష్ణ, ఏపీఓ తులసీ ప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.



ఏఓ విజయకుమార్‌ను ప్రశ్నిస్తున్న సర్పంచ్ హనుమంతరెడ్డి

స్కూల్ బస్సుల కండీషన్‌పై శ్రద్ధ చూపాలి

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలల బస్సు కండీషన్లపై ఆర్టీఓ అధికారి శ్రద్ధ కనబరిచి చర్యలు చేపట్టాలని ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి వంశీకృష్ణ శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రైవేట్ పాఠశాలలు వినియోగిస్తున్న బస్సులు ఏమాత్రం కండీషన్ లేవన్నారు. కండిషన్ లేని బస్సులు నడుపుతూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నట్లు చెప్పారు.

ఘనంగా వన్నూరుస్వామి ఉరుసు



ఆలయానికి పోటెత్తిన భక్తులు

కణేకల్లు: మండలంలోని జక్కలవడికిలో శనివారం వన్నూరుస్వామి ఉరుసు అంగరంగ వైభవంగా జరిగింది. వన్నూరుస్వామి ఆలయంలో స్వామి సమాధికి వస్త్రాలు, పూలచద్దర్‌లను పరిచి, ప్రత్యేక పూజలు జరిపించారు. శనివారం వేకువజామున షంషీర్‌ను అశ్వంపై గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. శనివారం సాయంత్రం పానకాల పండుగకు భక్తులు పోటెత్తారు. గ్రామస్తులు కుటుంబ సమేతంగా ఆలయానికొచ్చి పానకాలు సమర్పించారు. చెక్కరతో తులాభారం చేయించి, మొక్కులు తీర్చుకున్నారు.



ప్రత్యేక అలంకరణలో స్వామి వారి సమాధి

సామాజిక తనిఖీలో అక్రమాలు బహిర్గతం

కంబదూరు: మండలంలో 2023–24 సంవత్సరం వరకు ఉపాధిహామీ పథకం కింద జరిగిన పనులపై చేపట్టిన సామాజిక తనిఖీలో అక్రమాలు బహిర్గమతయ్యాయి. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో సామాజిక తనిఖీ బహిరంగా ప్రజా వేదిక నిర్వహించారు. జిల్లా ఉపాధి హామీ ప్రాజెక్ట్ డైరెక్టర్ సలీంబాషా, అడిషనల్ పీడీ సుధాకర్‌రెడ్డి, ఏసీడీ రమేష్ నాయక్, ఎస్ఆర్‌పీ లక్ష్మీనారాయణ హాజరయ్యారు. మండల వ్యాప్తంగా ఉపాధి హామీ పథకం, పంచాయతీ రాజ్ కింద 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.8 కోట్లతో సీసీ రోడ్లు, సచివాయం, ఆర్‌బీకే,హెల్త్ సెంటర్లు, ప్రహరీల నిర్మాణాలు, హార్టికల్చర్, బ్లాక్ ప్లాంటేషన్, అవెన్యూ ప్లాంటేషన్, డకౌట్, ఫారంపాండ్స్ తదితర పనులు చేశారు. ఈ పనులపై సామాజిక తనిఖీ బృందం సభ్యులు గ్రామాల్లో తనిఖీలు నిర్వహించారు.

రూ.4 లక్షలు రికవరీకి అధికారులు ఆదేశం..

తనిఖీల్లో బయటపడిన అక్రమాలు, అవకతవకలను డీఆర్‌పీలు ప్రజావేదికలో చదివి వివరించారు. ఉపాధి హామీ కింద జరిగిన పనుల్లో కొలతలు తేడాలు ఉన్నట్లు, అంగన్‌వాడీ ఉద్యోగులు ఉపాధి పనులకు వెళ్లి బిల్లులు చేసుకున్నట్లు, హార్టికల్చర్ కింది సాగు చేసిన పండ్ల మొక్కలు ఎండిపోయినట్లు గుర్తించారు. ఇందుకు సంబంధించి రూ.4 లక్షల వరకు అవినీతి జరిగిందని అధికారులు గుర్తించి, రికవరీకి ఆదేశించారు. అయితే బహిరంగ ప్రజా వేదికకు ప్రజలెవరూ హాజరు కాలేదు. సామాజిక తనిఖీ బృందం సభ్యులు, ఉపాధి హామీ సిబ్బంది మాత్రమే పాల్గొని కార్యక్రమాన్ని ముగించారు.



ప్రజావేదికకు ప్రజలు రాకపోవడంతో దర్శనమిస్తున్న ఖాళీ కుర్చీలు

10 నుంచి విప్రమలై నవ నారసింహస్వామి బ్రహ్మోత్సవాలు

రాయదుర్గంటౌన్: ప్రాచీన వైష్ణవాలయాల్లో ఒకటైన మల్లాపురం పంచాయతీలోని విప్రమలై లక్ష్మీ నవనారసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 10 నుంచి జరగనున్నాయి. ఏటా మాఘమాసం పౌర్ణమి రోజున నరసింహస్వామి బ్రహ్మ రథోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఈ నెల 10,11,12 తేదీల్లో మూడురోజులు పాటు బ్రహ్మోత్సవాల్లో జరుగుతాయి. సోమవారం ఉదయం నుంచి క్షేత్రమూల విరాట్ పరివార దేవత సమిత పంచామృతాభిషేకం, రక్షాబంధనం, అంకుర్పారణ, కలశ స్థాపనారాధన, ధ్వజారోహణ, సాయంత్రం శ్రీవారి నిశ్చయ తాంబూల స్వీకార కార్యక్రమం జరుగుతుంది. 11న శ్రీవారి కల్యాణోత్సవం, ఉచిత సామూహిక వివాహాలు, మండల దీక్షా హోమం, దీక్షామాలధారణ, 12న ఉదయం రథాంగ హోమం, మడుగుతేరు, బ్రహ్మరథోత్సవం జరుగుతుంది. విప్రమలై లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు భక్తులు తరలివచ్చి విజయవంతం చేయాలని ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు రామ్మూర్తి స్వామీ తెలిపారు. ఉత్సవాల్లో భక్తులకు అన్ని సౌకర్యాలూ కల్పించినట్లు తెలిపారు.



నరసింహస్వామి మూలవిరాట్

ఊట్లకుంటలో మురుగునీటితో అవస్థలు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని 28వ వార్డులోని ఊట్లకుంట మురుగునీటితో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఊట్లకుంట మురుగునీటితో దోమలు విజృంభించి, సమీపంలోని ప్రజలు అవస్థలు పడుతున్నారు. కుంటంతా గుర్రప్ప డెక్కతో పేరుకుపోయింది. కుంటలోనే చెత్తాచెదారం కూడా వేస్తుండడంతో అపరిశుభ్రంగా ఉంది. వేసవి సమీపిస్తుండడంతో దుర్వాసన వెదజల్లే అవకాశం ఉంది. దీనికితోడు దోమల బెడదతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. కుంటలో బోటింగ్ ఏర్పాటు చేస్తే పర్యాటకంగా మారడంతో పాటు మునిసిపాలిటీకి ఆదాయం సమకూరుతుందని అంటున్నారు.

11న మండల సాధారణ సర్వసభ్య సమావేశం

బ్రహ్మసముద్రం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 11న ఎంపీపీ కంభం చంద్రశేఖర్‌రెడ్డి అధ్యక్షతన మండల స్థాయి సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నందకిశోర్ ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచులు మండల స్థాయి అధికారులు హాజరు కావాలని కోరారు.

ఢిల్లీలో బీజేపీ విజయంపై 'దుర్గం'లో సంబరాలు

రాయదుర్గంటౌన్: దేశ రాజధాని ఢిల్లీ సార్వత్రిక ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ ఘన విజయంపై పట్టణంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు శనివారం సంబరాలు చేసుకున్నారు. పట్టణంలోని వినాయక సర్కిల్, లక్ష్మీ బజార్‌లలో బాణాసంచా పేల్చి మిఠాయిలు పంచిపెట్టారు.

నేటి నుంచి మైలార లింగేశ్వరస్వామి ప్రతిష్ట

బ్రహ్మసముద్రం: మండలంలోని పిల్లలపల్లి గ్రామంలో మైలార లింగేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ట ఆదివారం నుంచి ప్రారంభం కానుంది. ఉదయం గంగపూజ, కలశపూజ, విశేష పూజలు నిర్వహించనున్నారు. 10న తెల్లవారుజామున స్వామి విగ్రహ ప్రతిష్ట , హోమం, పూజల అనంతరం అన్నదాన కార్యక్రమం ఉంటుందని గ్రామస్తులు తెలిపారు.

ఘనంగా ఏకాదశి పూజలు



ప్రత్యేక అలంకరణలో రుక్మిణీ పాండురంగస్వామి

బొమ్మనహాళ్: ప్రసిద్ధి చెందిన ఉంతకల్లు రుక్మిణీ పాండురంగస్వామికి ఏకాదశి పూజలు వైభవంగా జరిగాయి. శనివారం తెల్లవారుజామున ప్రత్యేక జలంతో స్వామివారికి వేదమంత్రోచ్ఛారణల మధ్య ప్రత్యేక అభిషేకం చేశారు.

ముగిసిన వాసవీమాత విగ్రహ ప్రతిష్ట



వాసవీ మాత పల్లకీ మహోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

బొమ్మనహాళ్: మండలంలోని గోవిందవాడలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన నూతన ఆలయంలో వాసవీ కన్యకాపరమేశ్వరి, సుబ్రహ్మణ్యేశ్వర, నగరేశ్వర విగ్రహాల ప్రాణ ప్రతిష్ట శనివారంతో ముగిసింది. శనివారం వాసవీమాత, పరిహార దేవతలకు పంచామృతాభిషేకం అష్టోత్తర, సహస్రనామాలు నిర్వహించారు. నగరేశ్వర స్వామికి బిల్వార్చన అనంతరం వాసవీమాత పల్లకీ ఉత్సవం నిర్వహించారు.

శనీశ్వరస్వామికి విశేష పూజలు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కణేకల్లు రోడ్డు భగసింగ్ కాలనీలో వెలసిన శనీశ్వర స్వామికి శనివారం విశేష పూజలు చేశారు. రాయదుర్గం ప్రాంత పరిసరాల్లో శనీశ్వరాలయం ఒక్కటే ఉండడంతో ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.



విశేష పూజలందుకున్న శనీశ్వరస్వామి

ఆంజనేయస్వామికి పూజలు



కూడేరులో అలంకరణలో ఆంజనేయ స్వామి



ప్రత్యేక అలంకరణలో నేమకల్లు అంజన్న

బొమ్మనహాళ్/కూడేరు: ప్రసిద్ధి చెందిన నేమకల్లు అంజన్నకు శనివారం అభిషేకం నిర్వహించారు. స్వామి మూలవిరాట్‌ను పట్టువస్త్రాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. మాఘమాసం రెండో శనివారాన్ని పురస్కరించుకొని కూడేరు మండలం కొర్రకోడు, ఉదిరిపికొండ, కలగళ్ల, గొటుకూరు, కడదరకుంట, ముద్దలాపురం, కూడేరు, బసాపురం, రామదుర్గం, అంతరగంగలో ఆంజనేయస్వామి ఆలయాల్లో పూజలు జరిగాయి.

దిష్టిబొమ్మలా నీటిట్యాంకు

రాయదుర్గం టౌన్: పట్టణంలోని 26వ వార్డు ఓబుళాచారిరోడ్డులోని ఓ సిస్టన్ నీటి ట్యాంకు ఇంజనీరింగ్ అధికారుల నిర్లక్ష్యంతో దిష్టిబొమ్మలా మారింది. కాలనీ వాసులకు నీటి సౌకర్యం కల్పించేందుకు దిమ్మె నిర్మించి, ట్యాంకు తెచ్చి పెట్టారు. బోరు నుంచి పైప్‌లైన్, కరెంట్ కనెక్షన్ ఇచ్చి అందుబాటులోకి తెస్తే ప్రజలకు నీటి అవసరాలు తీరుతాయి. కానీ నెలలు గడిచిపోతున్నా ట్యాంకును వినియోగంలోకి తీసుకురాలేదు.



26వ వార్డులో దిష్టిబొమ్మలా కనిపిస్తున్న సిస్టన్ నీటి ట్యాంకు